# పార్టీ మారే ప్రసక్తే లేదు

## డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి

చేవెళ్లటౌన్, జనవరి 19 : పార్టీ మారుతున్నట్లు కొన్ని దిన పత్రికల్లో వచ్చిన వార్తలు అవాస్తవమని.. బీఆర్ఎస్ పార్టీ మారే ప్రసక్తే లేదని డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తానని కొన్ని పేపర్లలో వచ్చిన వార్తలు పూర్తిగా అబద్ధమన్నారు. పార్టీకి నిస్వార్థంగా పనిచేయడంతో డీసీఎంఎస్ చైర్మన్ పదవి ఇచ్చి గౌరవించారన్నారు. మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి వెంటే ఉంటూ బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. సబితమ్మ వెంటే ఉంటూ కాంగ్రెస్ పార్టీ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు. బీఆర్ఎస్‌లో తనకు మంచి గుర్తింపు ఉన్నదని.. కాంగ్రెస్ పార్టీ నాయకులు కావాలనే పార్టీ మారుతారని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని.. రానున్న ప్రభుత్వం కూడా కేసీఆర్ ప్రభు త్వమేనని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్, కందవాడ మాజీ ఎంపీటీసీ రవీందర్, చేవెళ్ల వ్యవసాయ మా ర్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నర్సింహులు, మండల ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి ,రామన్నగూడ గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లేశ్, రాంప్రసాద్, నాయకులు మాధవ రెడ్డి పాల్గొన్నారు.



# రైతు భరోసా సర్వే పకడ్బందీగా చేపట్టాలి..

కొడంగల్, జనవరి 19 : రైతుభరోసా, కొత్త రేషన్ కార్డుల కోసం కొనసాగుతున్న సర్వేను అధికారులు పకడ్బందీగా పూర్తి చేయాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. ఆదివారం పట్టణంలోని కొత్త రేషన్ కార్డులు, మండలంలోని పలు గ్రామాల్లో కొనసాగుతున్న రైతుభరోసా సర్వేను ఆయన తనిఖీ చేసి పరిశీలించారు. రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న పలువురు లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారి కుటుంబాల వివరాలను తెలుసుకున్నారు. అదేవిధంగా మండలంలోని వ్యవసాయేతర భూములను పరిశీలించారు. సాగులో ఉన్న ప్రతి ఎకరానికి రైతు భరోసా అందేలా అధికారులు పూర్తి చర్యలు చేపట్టి జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

# బేకరీలపై టాస్క్‌ఫోర్స్ దాడులు

## పలు ఐటమ్స్ సీజ్.. నిర్వాహకులపై కేసు నమోదు

వికారాబాద్ : కల్తీ ఆహార పదార్థాలను పట్టుకున్న పోలీసులు





ధారూరు బెంగళూరు బేకరీలో బయటపడిన గడువు ముగిసిన ఐటమ్స్

వికారాబాద్/ధారూరు, జనవరి 19 : ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే కల్తీ ఆహార పదార్థాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి హెచ్చరించారు. ఆదివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, ఎస్ఐ ప్రశాంత్‌వర్ధన్, సిబ్బంది వికారాబాద్ పట్టణంలో ని కేక్, బేకర్స్, ధారూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని బెంగళూరు అయ్యంగార్ బేకరీలలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గడువు ముగిసిన, అపరిశుభ్రంగా ఉన్న, సింథటిక్ ఫుడ్ రంగులు కలిపిన బేకరీ ఐటమ్స్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు. కేక్, బేకర్స్ యజమాని మనశ్, ధారూరులోని బెంగళూరు అయ్యంగార్ బేకరీ యజమాని సచిన్ లను అదుపులోకి తీసుకొని ఆయా ఠాణాల పరిధిలో కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

# నుమాయిష్‌లో సండే సందడి



అబిడ్స్, జనవరి 19: నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో కొనసాగుతున్న అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనకు సందర్శకులు పోటెత్తుతున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో భారీగా తరలివచ్చారు. ఆదివారం దాదాపు 70 వేల వరకు సందర్శకులు తరలి రాగా, ఇప్పటి వరకు నుమాయిష్ సందర్శించిన వారి సంఖ్య ఆరు లక్షల డెబ్బై వేల వరకు చేరుకుంది.

### పార్కింగ్ వసూలు..

నుమాయిష్‌కు వచ్చే సందర్శకులకు పార్కింగ్ పెద్ద తల నొప్పి. కాగా, పోలీసులు పలు ప్రాంతాలలో ఉచితంగా పార్కింగ్ చేసుకునేందుకు స్థలాలను ఎంపిక చేయగా, కొందరు ప్రైవేట్ వ్యక్తులు అక్కడక్కడ వాహనదారుల నుంచి పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అనధికారికంగా పార్కింగ్ స్లిప్‌లను ఇచ్చి వంద రూపాయల వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. పోలీసులు అటువంటి వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


# మా జోలికొస్తే ఊరుకోం..

## మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య

చేవెళ్లటౌన్, జనవరి 19 : తమ జోలికొస్తే ఉరుకునేది లేదని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య హెచ్చరించారు. ఆదివారం చేవెళ్ల మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో మాల మహానాడు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాలల వ్యతిరేక వైఖరిని మానుకోవాలని సూచించారు. మేధావుల ముసుగులో మాలలపై విషం కక్కడం తగదన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి వాకాస్, మహేశ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మహేశ్, యాదగిరి, సురేశ్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

# రెండు క్యారెట్లు కిలోకుపైగా..!

మార్కెట్‌లో సాధారణంగా ఒక్కో క్యారెట్ 30 గ్రాముల నుంచి 100, 150 గ్రాముల వరకు ఉంటుంది. అయితే, మార్కెట్ నుంచి ఓ దుకాణదారుడు తెచ్చిన 500 గ్రాముల నుంచి 650 గ్రాముల బరువున్న క్యారెట్ ఔరా అనిపిస్తున్నది. రెండు క్యారెట్‌లే కిలోకు పైగా తూగాయని మున్సిపాలిటీలోని తట్టిఅన్నారానికి చెందిన ఓ దుకాణదారుడు పేర్కొన్నాడు.





–పెద్దఅంబర్‌పేట, జనవరి 19



# నైవేద్యం సమర్పించి.. మొక్కులు చెల్లించి..

## వైభవంగా మైసమ్మ తల్లి జాతర

ధారూరు మండల కేంద్రంలో గ్రామ దేవత మైసమ్మ తల్లి జాతర ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచే అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. సాయంత్రం సమయంలో మహిళలు తమ తలలపై బోనాలను పెట్టుకుని ఊరేగింపుగా శివసత్తుల పూనకాలు, పోతరాజుల నృత్యాలతో ఆలయానికి తరలివెళ్లారు. అక్కడ చుట్టూ ప్రదక్షిణలు చేసి.. అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జగన్మాతా..పాహిమాం.. పిల్లాపాపలను సల్లంగా చూడాలని వేడుకున్నారు. ఈ జాతరను తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన ప్రజలు, భక్తులు భారీగా తరలివచ్చారు. -ధారూరు, జనవరి 19

## సాంస్కృతిక వైవిధ్యాన్ని భావి తరాలకు అందించాలి

రవీంద్రభారతి, జనవరి 19: భారతీయ వారసత్వం, సంస్కృతి, ఆధ్యాత్మిక అభ్యాసాలను నేటి యువతరానికి అందించాల్సిన అవసరం ఉందని, హరేకృష్ణ మూవ్‌మెంట్ చేసే పలు ప్రయత్నాల్లో ఈ ఫెస్ట్ అంతర్భాగమని, హెరిటేజ్ ఫెస్ట్ వంటి సాంస్కృతిక పోటీలు సనాతనమైన మన భారతీయ వారసత్వం, సాంస్కృతిక వైవిధ్యం, ఆధ్యాత్మిక విలువలను నేటి యువతరానికి అందించడంలో ఎంతో కాలంగా సమాజంలో విశిష్ట పాత్రను పోషిస్తుందని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బుర్రా వెంకటేశం అన్నారు. హరే కృష్ణ మూవ్‌మెంట్ హైదరాబాద్ వార్షికోత్సవ సాంస్కృతికోత్సవమైన హెరిటేజ్ ఫెస్ట్ వేడుకలను ఆదివారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ పబ్లిక్ కమిషన్ చైర్మన్ బుర్రా వెంకటేశం, హరేకృష్ణ హైదరాబాద్, అక్షయ పాత్ర ఫౌండేషన్ ప్రాంతీయ (తెలంగాణ, ఏపీ) అధ్యక్షులు సత్య గౌర చంద్ర దాస ప్రభూజీలు విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రతిభావంతులైన విద్యార్థులు సంప్రదాయ నృత్యం, నాటకం శాస్త్రీయ సంగీతం, భగవద్గీత శ్లోక పఠనం, వేదిక క్విజ్, రంగులు వేయడం వంటి వారికి బహుమతులను ప్రదానం చేశారు. సత్య గౌర చంద్ర దాస ప్రభూజీ సభా అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి విచ్చేసిన బుర్రా వెంకటేశం మాట్లాడుతూ, అంతరించిపోతున్న ప్రాచీన సంప్రదాయ కళలను పరిరక్షించుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు.

# నగర వేదికపై హై లైఫ్ ప్రదర్శన




సిటీబ్యూరో, జనవరి 19(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ వేదికగా అతి పెద్ద ఫ్యాషన్ అండ్ లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ జరగనుంది. హై–లైఫ్ ఎగ్జిబిషన్ పేరిట జనవరి 31 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు నగరంలోని హెచ్ఐసీసీలో నిర్వహించనున్నారు. కొత్త ఏడాదిలో తొలిసారిగా నిర్వహించనున్న ఈ ఫ్యాషన్ పండుగలో క్రియేటివ్ ఫ్యాషన్ వేర్, లైఫ్ స్టైల్ వేర్, బ్రైడల్ వేర్, డిజైనర్ వేర్, యాక్సెసరీస్, జువెల్లరీ వంటి ఫ్యాషన్ ఉత్పత్తులను ప్రదర్శించనున్నారు. ఈ ఫ్యాషన్ పండుగలో దేశ, విదేశీ ఉత్పత్తులు, ఫ్యాషన్ డిజైన్లు, డిజైనర్లు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

# జాతి ఔన్నత్యాన్ని పరిరక్షించుకోవాలి

## ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

రవీంద్రభారతి, జనవరి 19: విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ జాతి ఔన్నత్యాన్ని విలువలను పరిరక్షించాలని, ఈ దిశగా సంఘాలు కృషి చేయాలని శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. నగరంలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ఆదివారం ముఖ్య అతిథిగా విచ్చేసిన సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ, జాతిని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తే ప్రభుత్వాలకు భంగుపాటు తప్పదని హెచ్చరించారు. పంచాదాయ వృత్తులైన కమ్మరం, వడ్రంగం, ఇత్తడి, శిలా శిల్పి, స్వర్ణకార వృత్తిదారుల అభ్యున్నతికి ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. కార్పొరేట్ సంస్థల ప్రవేశంతో అణగారిపోతున్న కమ్మర, వడ్రంగి, ఇత్తడి, శిలా శిల్పి, స్వర్ణకార సంప్రదాయ వృత్తులను ప్రోత్సహించాలన్నారు. విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగి అభివృద్ధిన సాధించాలన్నారు. ప్రభుత్వాలు విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ జాతి కులవృత్తులను ప్రోత్సహించాలన్నారు. విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వేముల మదన్‌మోహన్ మాట్లాడుతూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ జాతీయులకు అభ్యర్థులుగా ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. గౌరవ అధ్యక్షుడు లాలుకోట వెంకటాచారి మాట్లాడుతూ, జాతి అభ్యుదయానికి రాష్ట్రంలోని అన్ని సంఘాల నాయకులు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ కార్పొరేషన్‌కు రూ.1000 కోట్లు కేటాయించాలని పాలక మండలి తీర్మానం చేసింది. ఈ సందర్భంగా తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం రూపొందించిన 2025 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు, సంఘం కోశాధికారి రాగిఫణి రవీంద్రాచారి, అద్దంగి నాగేశ్వరరావు, కోణ్యాల శివానందం, పులిగిళ్ల శ్రీనివాసాచారి, చంద్రమౌళి, బిక్షపతి, రవికిరణ్, లక్ష్మణాచారి పాల్గొన్నారు.

# పద్మశాలీలను విస్మరిస్తే ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు

## అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి

హిమాయత్‌నగర్, జనవరి 19: రాష్ట్రంలోని పద్మశాలీలకు అన్ని రంగాల్లో తగిన ప్రాధా న్యత కల్పించాలని లేని పక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, ఇంజినీర్స్ విభాగం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పుట్ట పాండు రంగయ్య హెచ్చరించారు. నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో సంఘం ముఖ్యనేతల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బీసీ జనాభాలో అత్యధిక సంఖ్యల్లో ఉన్న పద్మశాలీలకు చట్ట సభలో తగిన ప్రాతినిధ్యం లేదని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పద్మశాలీలకు జనాభా ప్రాతి పదికన అన్ని రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని పద్మశాలీలు ఐక్యతతో ముందుకు సాగి ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని వారు ఆవిష్కరించారు. సమావేశంలో సంఘం నేతలు శ్రీధర్ ఎన్.సుంకూర్ వార్, గడ్డం జగన్నాథం, కమర్తపు మురళి, వనం దుశ్యంతల, ప్రభాకర్, మసున మోహన్ నారాయణ, చంద్రమౌళి, నక్క వేణుమాధవ్, గుంటక రూప, మాచర్ల రాంచందర్, బొల్ల శివ శంకర్, సంకు సుధాకర్, చింతకింది విజయ్ ప్రసాద్, శ్రీనివాస్, ఎస్.మార్కండేయ, దేవేందర్, మెతుకు సత్యం పద్మ, విద్యాసాగర్, శ్రావణ్ పాల్గొన్నారు.



పండుగ సాయన్న విగ్రహాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి సబితారెడ్డి

# ప్రజల పక్షాన నిలిచిన యోధుడు సాయన్న

బడంగ్‌పేట, జనవరి 19 : రజాకార్ల దుర్మార్గాలను ఎదిరించి ప్రజల పక్షాన పోరాటం చేసిన గొప్ప యోధుడు పండుగ సాయన్న అని మాజీ మంత్రి సబితా రెడ్డి అన్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ చందన చెరువు కట్టపై మీర్‌పేట ముదిరాజ్ సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పండుగ సాయన్న విగ్రహాన్ని చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి ముదిరాజ్, నీలం మధు ముదిరాజ్‌లతో కలిసి సబితారెడ్డి ఆదివారం ఆవిష్కరించి మాట్లాడారు. అన్యాయం ఎక్కడ జరిగితే అక్కడ సాయన్న ప్రత్యక్షమయ్యేవారన్నారు. పేదల కడుపు నింపిన వీరయోధుడు పండుగ సాయన్న అని ఆమె కొనియాడారు. అలాంటి మహనీయుని విగ్రహాన్ని తన సెగ్మెంట్‌లో ఏర్పాటు చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. పండుగ సాయన్నను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ముదిరాజులను బీసీ డీ నుంచి బీసీ బీ లోకి మార్చేలా చొరవ తీసుకోవాలని సంఘం నాయకులు ఎమ్మెల్యేకు విన్నవించారు. కార్యక్రమంలో మీర్‌పేట మేయర్ దుర్గా దీప్‌లాల్, బడంగ్‌పేట మేయర్ పారిజాత, డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డి, కమిషనర్ జ్ఞానేశ్వర్, నాయకులు శ్రీరాములు యాదవ్, శంకర్‌రెడ్డి, కామేశ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ లావణ్య, గణేశ్, రాఘవేందర్, శివశంకర్, దయానంద్, కార్పొరేటర్లు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

### ఆక్యుపంచర్ శిబిరం ప్రారంభం

జిల్లెలగూడ చందనచెరువు కట్టపై వేముల విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆక్యుపంచర్, న్యాచురోపతి శిబిరాన్ని మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ.. ఆక్యుపంచర్ వైద్యం చాలా మెరుగైనదని, గతంలో తానూ చేయించుకున్నట్లు చెప్పారు. ఎలాంటి మందులు లేకుండా తగ్గించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఇలాంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

# ప్యారడైజ్ నుంచి మెట్రో లేనట్లే..

## నార్త్ సిటీ మెట్రో నిర్మాణంలో కీలక మలుపు

| | | |
|---|---|---|
| జేబీఎస్ నుంచి మొదలై మేడ్చల్, శామీర్‌పేట్ వరకు రెండుగా చీలనున్న మెట్రో | భవిష్యత్‌లో అతిపెద్ద జంక్షన్‌గా మారనున్న జేబీఎస్ | ప్యారడైజ్-మేడ్చల్ రూట్‌కు అడ్డంకిగా ఎయిర్‌పోర్టు |

సిటీబ్యూరో, జనవరి 19(నమస్తే తెలంగాణ) : నార్త్ సిటీలో కీలకమైన ప్యారడైజ్–మేడ్చల్ మార్గంలో మార్పులపై మెట్రో దృష్టి పెట్టింది. బేగంపేట ఎయిర్‌పోర్టు మీదుగా మెట్రో లైన్ తీసుకెళ్లడంలో ఎదురవుతున్న ఇంజినీరింగ్ సాంకేతిక ఇబ్బందులు దృష్ట్యా... ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. దీంతో ఇన్నాళ్లు ప్యారడైజ్ నుంచి మెట్రో ప్రారంభమవుతుందని భావించినా... అలైన్‌మెంట్ మార్పులతో ఆ కల కనుమరుగు కానున్నది. అయితే జేబీఎస్ ప్రధాన వై జంక్షన్‌గా మారనుండగా జేబీఎస్ వద్ద రెండుగా చీలి ఒకటి మేడ్చల్ వైపు, మరోకటి శామీర్‌పేట వైపు పయనించనున్నది. ఈ మార్గంలో ఇరుకైన రోడ్లు, బేగంపేట ఎయిర్‌పోర్టు మెట్రో మార్గానికి ప్రధాన ఆటంకాలుగా మారుతుండగా... సాధ్యాసాధ్యాలపై మెట్రో అధికారులు మల్లాగుల్లాలు పడుతున్నారు. ఆదివారం ఈ మార్గంలో హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి, ఇంజినీరింగ్ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ప్యారడైజ్ నుంచి మేడ్చల్ మార్గంలో మెట్రో నిర్మాణం సాధ్యం కాదని, అందుకే నేరుగా జేబీఎస్ కేంద్రంగా మెట్రోను నిర్మించడమే ఈ సమస్యకు పరిష్కారం అవుతుందని తేల్చింది.




### అడ్డంకులెన్నో...

స్వల్ప మార్పులతో నార్త్ సిటీ మెట్రో మార్గానికి రూపొందించేందుకు హైదరాబాద్ మెట్రో సంస్థ సన్నాహాలు చేస్తోంది. ప్యారడైజ్–మేడ్చల్(23కి.మీ), జేబీఎస్–శామీర్‌పేట(22కి.మీ) మార్గంలో మెట్రో అలైన్‌మెంట్ ప్రతిపాదించారు. అయితే ప్యారడైజ్ నుంచి మేడ్చల్ వెళ్లే మార్గంలో బేగంపేట్ ఎయిర్‌పోర్టు ప్రధాన అడ్డంకిగా మారింది. దీంతో ప్యారడైజ్ వద్ద మెట్రో స్టేషన్ కంటే... జేబీఎస్ వద్ద మెట్రో జంక్షన్ ఏర్పాటు చేస్తే సరిపోతుందని మెట్రో ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషణలో భాగంగా ప్యారడైజ్ నుంచి తొలగించే అవకాశం ఉంది. వాస్తవానికి ప్యారడైజ్ నుంచి మొదలై, బేగంపేట ఎయిర్‌పోర్టు మీదుగా బోయిన్‌పల్లి వరకు రోడ్డు వంకలు తిరిగి ఉండటం, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆంక్షల నేపథ్యంతో ఈ మార్గంలోనే మెట్రో నిర్మాణం సాధ్యం కాదని భావిస్తున్నారు. ఇప్పటికే ఈ మార్గంలో హెచ్ఎండీఏ ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టును బేగంపేట ఎయిర్‌పోర్టు ఇబ్బందులతో అండర్ గ్రౌండ్ టన్నెల్ ప్రాజెక్టుగా చేపడుతున్నారు. ఇలాంటి సందర్భంలో ఎయిర్‌పోర్టు మీదుగా మెట్రో అసాధ్యమని భావించారు. ఈ క్రమంలో అండర్ గ్రౌండ్ నుంచి ఎలివేటెడ్ ప్రాజెక్టుగా చేపట్టడం అత్యంత క్లిష్టమని భావించిన మెట్రో సంస్థ... అందుకు జేబీఎస్ నుంచి మెట్రో ప్రారంభించడంపై అధ్యయనం చేస్తున్నది.

### మారనున్న అలైన్‌మెంట్...

ఈ క్రమంలోనే జేబీఎస్ నుంచి ప్రారంభించి సికింద్రాబాద్ క్లబ్ రోడ్డు, స్టాఫ్ రోడ్డు, మడ్‌ఫోర్ట్ రోడ్డు, టీవోలీ జంక్షన్ రోడ్డు, డైమండ్ పాయింట్ జంక్షన్, సెంటర్ పాయింట్ జంక్షన్, హస్మత్‌పేట్ జంక్షన్ బోయిన్‌పల్లి రోడ్డు, తాడ్‌బండ్ హనుమాన్ టెంపుల్ రోడ్డు, ఎయిర్‌పోర్టు ఆఫీస్ జంక్షన్, బోయిన్‌పల్లి చెక్‌పోస్టు, మీదుగా సుచిత్ర మార్గంలో ఉండే జాతీయ రహదారి జంక్షన్ వద్ద ఆలైన్‌మెంట్‌ను అనుసంధానం చేయాలని భావిస్తున్నారు. ఇప్పటికే విస్తరించిన జాతీయ రహదారికి అడ్డం లేకుండా ఎన్‌హెచ్ సర్వీస్ లేన్‌పై మెట్రో స్తంభాలు, వయడక్టును నిర్మించడం ఉత్తమమని చెబుతున్నారు. ఇలా మార్చడం వల్ల బేగంపేట ఎయిర్‌పోర్టుకు దూరంగా మెట్రో ఎలాంటి అడ్డంకులు లేకుండా మేడ్చల్ వరకు తీసుకెళ్లే మార్గాలను అన్వేషిస్తున్నారు.

### వై జంక్షన్‌గా జేబీఎస్...

ప్రస్తుతం జేబీఎస్ ఇన్ గేట్ వద్ద మెట్రో లైన్ నిలిచిపోయింది. ఇక్కడి నుంచి డబుల్ డెక్కర్ నిర్మాణం చేపట్టి... నేరుగా సికింద్రాబాద్ క్లబ్ రోడ్డు మీదుగా నేరుగా శామీర్‌పేట మెట్రో లైన్‌ను, హెచ్ఎండీఏ నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్‌తో అనుసంధానం చేయనున్నారు. అయితే నార్త్ సిటీ మెట్రో నిర్మాణంలో... భవిష్యత్‌లో జేబీఎస్ మెట్రో వై జంక్షన్ కీలకం కానున్నది. ఒక చీలిక మేడ్చల్ వైపు, మరో చీలిక శామీర్‌పేట వరకు పయనించనున్నది. దీనికి కనీసం 30 ఎకరాల భూమిని సమీకరించనున్నారు. జేబీఎస్ వద్ద రక్షణ, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి భూ సమీకరణ సులభతరం కానున్నది.